### కారు ఢీకొని ఒకరి మృతి

తాండూర్, జూలై 20 : కారు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పోచంపల్లికి చెందిన అల్లకొండ పోశం (50) బోయపల్లి బోర్డు వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఇదే సమయంలో ఆసిఫాబాద్ నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో పోశం ఎగిరి కారుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి పెద్ద కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# వీడని ముసురు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వాన
- పరవళ్లు తొక్కుతున్న ప్రాణహిత, గోదావరి నదులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. గురువారం జిల్లావ్యాప్తంగా 60.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వట్టివాగు ప్రాజెక్టులోకి ప్రస్తుతం 640 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 60 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. చెలిమెల ప్రాజెక్టులోకి 64 క్యూసెక్కుల నీరు వస్తోంది. మరోవైపు ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తోంది. అత్యధికంగా బెజ్జూర్‌లో 257.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాంకిడిలో 116.8 , జైనూర్‌లో 45.8, సిర్పూర్-(యూ)లో 40.0, లింగాపూర్‌లో 25.6, తిర్యాణిలో 28.6, రెబ్బెనలో 29.0, ఆసిఫాబాద్‌లో 20.0, కెరమెరిలో 43.4, కాగజ్‌నగర్‌లో 41.4, సిర్పూర్-(టీ)లో 66.6, కౌటాలలో 39.2, చింతలమానేపల్లిలో 10.8, పెంచికల్‌పేట్‌లో 72.4, దహెగాంలో 66.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

#### కుమ్రం భీం ప్రాజెక్టు మూడు గేట్ల ఎత్తివేత

ఆసిఫాబాద్ టౌన్, జూలై 20 : జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుమ్రం భీం ప్రాజెక్ట్ నిండుకుండలా కనిపిస్తుంది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 243 మీటర్లు(10.393 టీఎంసీలు) ఉండగా, 4382 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో ప్రస్తుత నీటి మట్టం 237.5 మీటర్లు (5.718 టీఎంసీ)లకు చేరిందని అధికారులు తెలిపారు. దీంతో 4,5,6 మూడు గేట్లను 0.5 మీటర్లు ఎత్తి 3146 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

#### మంచిర్యాల జిల్లాలో 36.7 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాల అర్బన్, జూలై 20 : జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు ముసురుతో కూడిన వర్షం పడడంతో ప్రభుత్వం విద్యా సంస్థలకు గురు, శుక్రవారాలు సెలవులు ప్రకటించింది. దీంతో గురువారం ఉదయం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.

#### జిల్లాలో 36.7 మిల్లీ మీటర్ల వర్షం

జిల్లావ్యాప్తంగా గురువారం 36.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోటపల్లి మండలంలో అత్యధికంగా కురియగా, లక్సెట్టిపేటలో అత్యల్పంగా పడింది. జన్నారం మండలంలో 46.7 మిల్లీ మీటర్లు కురవగా, దండేపల్లిలో 50.3, లక్సెట్టిపేటలో 18.1, హాజీపూర్‌లో 27.9, కాసిపేటలో 41.2, తాండూరులో 19.5, భీమినిలో 18.8, కన్నెపల్లిలో 36.9, వేమనపల్లిలో 37.6, నెన్నెలలో 44.8, బెల్లంపల్లిలో 40.5, మందమర్రిలో 28.4, మంచిర్యాలలో 34.1, నస్పూర్‌లో 24.1, జైపూర్‌లో 54.6, భీమారంలో 21.0, చెన్నూర్‌లో 49.3, కోటపల్లి మండలంలో 67.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 352.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 357.5 మిల్లీ మీటర్లు నమోదైనట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం మాత్రమే సాధారణం కంటే తక్కువగా ఉండగా, జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో అధికంగా వర్ష పాతం నమోదు కాగా మిగితా 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

#### ప్రాణహిత పరవళ్లు..

కౌటాల, జూలై 20 : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతున్నది. అలాగే వార్ధా, వైన్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నదుల సంగమం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితలో కలవడంతో ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తుంది. వరద ఉధృతి ఎక్కువగా ఉందని, ప్రయాణికులు నాటుపడవల్లో వెళ్లవద్దని, జాలరులు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

#### వాంకిడి మండలంలో..

వాంకిడి,జూలై 20: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఖమానా గ్రామ పరిధిలోని పాఠగూడ గ్రామంలో రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే నవేధరి చెరువుకు భారీగ వరద చేర డంతో జనాలు చేపల పట్టారు. ఒకరు చెరువు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గాయపడ్డారు.

#### బెజ్జూర్ మండలంలో..

బెజ్జూర్, జూలై 20 : మండలంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున గల ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. గడిచిన 24 గంటల్లో బెజ్జూర్‌లో 257.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీపాల్ సూచించారు.



చింతలమానేపల్లి : గూడెం -అహెరి అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

#### పెంచికల్ పేట్ మండలంలో..

పెంచికల్‌పేట్, జూలై 20: మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దవాగు, ప్రాణహిత, ఉచ్చ మల్లి వాగు, బొక్కి వాగు పొంగిపొర్లుతున్నాయి. ఎర్రగుంట గ్రామానికి చెందిన పెదం సిద్దయ్య పెంకుటిల్లు గురువారం ఉదయం కూలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## వర్షాల నేపథ్యంలో బల్దియా అప్రమత్తం

మంచిర్యాలటౌన్, జూలై 20: రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ, ప్రభుత్వ హెచ్చరికలతో మంచిర్యాల మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. గతేడాది సంభవించిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, ఎలాంటి విపత్తులు సంభవించినా సమర్థవంతంగా ఎదురుకునేలా సమాయత్తమైంది. గత సంవత్సరం జూలై 12 నుంచి రెండు రోజులు పాటు కురిసిన భారీ వర్షాలకు మంచిర్యాల పట్టణం అతలాకుతలమైంది. ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, పద్మశాలీకాలనీ, మేదరివాడ, పాత మంచిర్యాల, శ్రీశ్రీనగర్, సాయికుంట, గర్మిళ్ల ప్రాంతాలు నీటమునిగాయి. దాదాపు రెండు వేలకు పైగా ఇండ్లలోకి వరద చేరింది. ఇక్కడే గాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు నీట మునగడంతో సత్వరమే ప్రజలకు సేవలు అందించేందుకు ప్రతీ మున్సిపాలిటీ నుంచి కొంతమంది సిబ్బందిని ఎంపిక చేసి డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఇలా మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన 11 మందికి డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో రెండు వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరిలోఎలక్ట్రికల్ విభాగంలో పని చేసే సిబ్బంది ఒకరు, పారిశుధ్య జవాన్లు ఇద్దరు, చైన్‌మెన్, వాటర్‌సప్లై సిబ్బంది ఒక్కొక్కరు, మిగిలిన వారు పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో వారికి కావాల్సిన నాటుపడవలు, ఆధునిక మరబోట్లు అందుబాటులో ఉంచారు. ఏదైన ఉపద్రవం ముంచుకొస్తే ముందస్తుగా ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలు, వారు ఉండేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచుతున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం, ఎఫ్‌సీఏ హాలు, షాదీఖానా, తదితర ప్రాంతాల్లో పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ సమయంలో ఏం జరిగినా ఎదుర్కొనేందుకు అధికార, పాలక యంత్రాంగాలు సిద్ధంగా ఉన్నాయని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటామని, ఇంకా వర్షం వల్ల వరద ప్రభావం మంచిర్యాలకు లేదని ఆయన అన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్

ఆసిఫాబాద్ టౌన్,జూలై 20 : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై జిల్లా వైద్యాధికారి రామకృష్ణతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మురుగునీరు ఎక్కువగా నిల్వ ఉండే చోట మత్స్యశాఖ ఆధ్వర్యంలో గంబూసియా చేపలు పెంచడం లాంటి కార్యక్రమాలు చేయాలన్నారు. వ్యాధుల నివారణకు పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా అవసరమని, ప్రజలకు అలాగే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, వైద్య సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

#### ఈవీఎం, వీవీప్యాట్ వాహనం ప్రారంభం

జిల్లాలో ఓటుపై అవగాహన కల్పించేందుకు ఈవీఎం వీవీ ప్యాట్లతో కూడిన అవగాహన వాహనాన్ని కలెక్టర్ బోర్కడే హేమంత్ అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో తిరుగుతూ ఓటు ప్రాముఖ్యత ఓటువేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సీపీవో రవీందర్, ఆర్డీవో రాజేశ్వర్, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రమోద్, తహసీల్దార్ రామ్మోహన్ రావు, డీటీ జితేందర్, వివిధ పార్టీల నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, ZEENAT W/o. KABIRUDDIN RAJANI R/o. H.No.5-7-77/A, MG Road, Adilabad is hereby declare that hence Change my name as "RAJANI ZEENAT" Holding Passport No.B5938118 Dt. 30.08.2001 to 29.08.2011 issued at Hyderabad. hence declare

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads



మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677